# తృప్తి

కన్నోజు మనోహరాచారి

**''ఆర్ యు సాటిస్‌ఫ్యాక్టరీ విత్ యువర్ డే-టు-డే లైఫ్...?'' చాలాకాలం తరువాత పరిచయమున్న ఒక పెద్ద ఐఏఎస్ ఆఫీసర్‌తో రాత్రి తొమ్మిది గంటలకు ఒక విందు పార్టీలో అడిగాను.**

**''ఏ విషయంలో సాటిస్‌ఫాక్టరీ...?'' ఎదురు ప్రశ్నించాడు అతను.**

**''నాకైతే ఈ జీవితం పరమబోరుగా వుంది. పిల్లల చదువులు, వాళ్ళ సెటిల్‌మెంట్లు, భార్య ఉదయాన్నే ఉద్యోగానికెళ్ళడం, నేనూ ఇంత ఉడకేసుకుని ఆఫీసుకెళ్ళడం - రాత్రికి ఎప్పుడో అందరం ఒక దగ్గర కలవడం - అలా కాసేపు నిద్రపోతామో లేదో - తిరిగి తెల్లవారడం ... మళ్ళీ అదే రొటీన్ జీవితం.''**

''అందరం అంతేగా మరి'' నా సోదరి కట్ చేస్తూ అన్నాడు. ''ఎవరు తృప్తిగా వున్నారు ఈ జీవితంలో. నాకు మాత్రం లేవా సమస్యలు'' టమాటా సూప్‌ను చప్పరిస్తూ అన్నాడు అధికారి.

''మీరే గవర్నమెంట్. మీకేం సమస్యలుంటాయి సార్...?''

నా ప్రశ్నకు ఒక్కసారి భళ్ళుమని నవ్వాడు అతను.

''అందరూ అనుకుంటున్నది అదే. సెక్రటేరియట్‌లో కూర్చునే ప్రతివాడు గవర్నమెంట్. అందరూ ఆర్డర్లు వేసేవారే. అయినా ఎక్కడి సమస్యలు అక్కడే వున్నాయిగా'' భోజనం చేయడానికి ప్లేట్ తీసుకుంటూ అన్నాడు అధికారి.

''ప్రజలకు ఏం మంచి జరుగుతోంది. ఏ పని చేద్దామన్నా ప్రతిపక్షాలు గగ్గోలు పెడతాయి. కోర్టులు, చట్టాలు, సిఎం దగ్గర నుంచి మంత్రుల్ని, శాసనసభ్యుల్ని, ప్రతిపక్షాలను అందరినీ ఒప్పించాలంటే కష్టసాధ్యమైన పని. అందర్నీ ఒప్పించే కార్యక్రమం అమలు చేయాలంటే క్రిందిస్థాయిలో జరిగే అక్రమాలు, అవినీతి, దౌర్జన్యాల వలన ప్రజలకు ఫలితం అందడం లేదు. అందుకే ఒక్కోసారి నా ఉద్యోగానికి రాజీనామా చేయాలనిపిస్తుంటుంది. జీవితం పట్ల తృప్తి అంటూ నాకు లేదు'' - భోజనం ముగించి కారు ఎక్కుతూ అన్నాడు అధికారి.

సంసార చక్రంలో నలిగిపోయిన నాకు జీవితం పట్ల తృప్తి లేదంటే అర్థముంది గానీ, ఒక్క కలంపోటుతో లక్షలమందికి లాభం చేకూర్చే పథకాల అమలు తీరు సరిగా లేక బాధపడే ఉన్నతాధికారి కూడా తృప్తిగా లేడంటే లోపం ఎక్కడో వుంది.

లైఫ్ పట్ల ఒక డిప్రెషన్, యాంత్రిక జీవితం, మెకానికల్... ఏదో అసంతృప్తి, అసహనం, ఏమీ చేయలేని చేతకాని తనం నాకు ఈమధ్య ఎక్కువైపోయింది.

అయిదేళ్ళు ఎమ్మెల్యేగా వుండి, మొన్నటి ఎన్నికల్లో ఓడిపోయిన వాడు నా క్లోజ్ ఫ్రెండ్. ఎమ్మెల్యే కాకముందు రోడ్లమీద మిర్చి బజ్జీలమ్మే బండి పక్కన నిలబడి ఎన్నోసార్లు వేడివేడి మిర్చీలకు ఉల్లిపాయ నంజుకుంటూ కొసరికొసరి మరికొంచెం చట్నీ వేయించుకుంటూ తిన్నాం ఇద్దరం కూడా.

ఎమ్మెల్యేగా వున్న అయిదేళ్ళలో వాడు అనంతంగా సంపాదించాడు. అనేక వ్యాపారాల్లో పెట్టుబడి పెట్టాడు. ఓడిపోయిన ఎమ్మెల్యేగా ఇప్పటికీ ప్రజలు వీడిని అనేక మీటింగులకు ముఖ్యఅతిథిగా ఆహ్వానిస్తుంటారు.

స్కూల్లో జరిగిన ఒక కార్యక్రమానికి మావాళ్లు ఈ మాజీ ఎమ్మెల్యేని ఆహ్వానించారు. సాంస్కృతిక కార్యక్రమాలకు రూపకల్పన చేసింది నేనే కాబట్టి తప్పనిసరిగా నేను స్టేజీమీద ఉండాలి. ఓడిపోయిన ఎమ్మెల్యే అయినప్పటికీ, నా స్నేహితుడిని చాలారోజుల తరువాత చూస్తున్నాననే ఆనందం నాలో ఉప్పొంగుతోంది.

కార్యక్రమం ప్రారంభమైంది.

మాజీ ఎమ్మెల్యే పక్క సీట్లోనే నేను కూర్చున్నాను. కార్యక్రమం అయిపోయేంతవరకు ఇద్దరం చిన్ననాటి సంగతులన్నీ నెమరువేసుకుంటూ ఒకటే నవ్వుకున్నాం.

''నీకేంరా... బాగా సంపాదించావు. నీ పిల్లలకు, మనవలకి కూడా సరిపోయేంతగా ఆస్తుల్ని సంపాదించావు. ఇంక నీకేం దిగులుంది. జీవితాన్ని బాగా ఎంజాయ్ చేస్తున్నావు గదూ. లైఫ్ అంటే తృప్తిగా వుందిగదా'' నా మనసులోని మాట బయటపెట్టాను.



వాడు ఒక్కసారిగా భళ్లున నవ్వాడు. ''పిచ్చోడా, నేనేం సంపాదించానా. నా తోటి ఎమ్మెల్యేలు నాకన్నా నాలుగింతలు ఎక్కువ సంపాదించారు. వాళ్ళు మళ్ళీ గెలిచి ఇప్పుడు అసెంబ్లీలో వున్నారు. నేను ఓడిపోయాను. నేను సంపాదించింది ఏమీలేదు. ఇంకా ఏదో చేయాలి. రేపటి ఎన్నికల్లో మళ్లీ పోటీచేయాలి. గెలవాలి. మంత్రిన వ్వాలి. అప్పుడు చూడరా. నా సంపాదన మీద ప్రస్తుతం నాకేం తృప్తిలేదు'' అంటూ కారెక్కి వెళ్ళిపోయాడు.




తృప్తి... తృప్తి... తృప్తి... ప్రభుత్వ ఉత్తర్వులిచ్చే ఉన్నతాధికారికి తృప్తి లేదు. కోట్ల రూపాయలు గడించి, మళ్ళీ మంత్రిపదవివైపు చూస్తున్న మాజీ ప్రజా ప్రతినిధికి తృప్తిలేదు.

మరి తృప్తి ఎవరికుంది? అర్థంకాలేదు.

ఈ మధ్యే పేపర్లో చదివాను. రవీంద్ర భారతిలో జరిగిన ఒక సన్మాన సభకు ముఖ్యఅతిథిగా హాజరైన ఒక అగ్రనటుడు మాట్లాడుతూ – నేనింతకాలం నటించిన నటన పట్ల నాకేమాత్రం తృప్తిగా లేదు. నటనలో నేను నేర్చుకోవలసింది ఇంకెంత వుంది అన్నాడు. ఆ నటుడు ప్రస్తుతం ముసలితనంలో వున్నాడు.

జీవితంలో ముప్పావుభాగం నటనకే కేటాయించి, కోట్లు గడించినప్పటికీ నటన పట్ల తనకు తృప్తి ఇంకా తీరలేదన్నాడు ఆయన.

అగ్రనటుడి మాటలు నాకు అర్థం కాలేదు. ఇంకేం నటన నేర్చుకుంటాడు ఈ వయసులో. లేదా ఇంకా తనకు అవకాశాలు కల్పించి తన నటనా పటిమను చాటుకోవడానికి నిర్మాతలకు ఇచ్చే గ్రీన్‌సిగ్నల్లా... ఆయన మాటలు!!

ఆలోచిస్తూ నడుస్తున్న నాకు 'అయ్యా, ధర్మం చేయండి' అంటూ వాడి రెండు చేతులూ నా ఛాతికి ఆనిస్తూ మరీ బిచ్చమడగడం చిర్రెత్తుకొచ్చింది.

''చేతులు తీయి ముందు'' అరిచినంత పని చేశాను.

''అంత కోపమెందుకయ్యా. బిచ్చగాణ్ణి'' అన్నాడు వాడు.

''బిచ్చగాడయితే పూర్తిగా ఒంటిమీదికొచ్చి అడుక్కోవాలా. నీ కంపంతా నాకు అంటించాలా'' కోపంగా అన్నాడు.

''అదేంటి సార్. బిచ్చమేస్తే వేయి... లేదంటే వూరుకో'' – నన్నే బెదిరిస్తూ అన్నాడు.

రోషంతో వాడు అరుస్తుంటే వాడి నోటి తుంపర్లు నాపైన పడడం అసహ్యంగా వుంది.

మా ఇద్దరి మాటలకు జనం మెల్లిమెల్లిగా గుమిగూడడం గమనించాను.

''ఇంతకు నాకు డబ్బులిస్తారా? లేదా?'' వాడు నన్ను నిలదీయడం, నలుగురు మమ్మల్ని చూడడం – నేనేదో బిచ్చగాడితో పోట్లాడుతున్నట్లుగా అనిపించింది పక్కకు తప్పుకున్నాను.

వాడు నా వెంటే రావడం గమనించాను.

సడన్‌గా నా మనసులోని మాట ఎందుకో ఒక్కసారిగా బయటికొచ్చింది. ఒక్కసారిగా కూల్ అయిపోయాను.

''నిజం చెప్పు. నీకు బిక్షాటన వలన తృప్తిగా వుందా?'' నా మాటలు వాడికి అర్థం కాలేదు. నొసలు చిట్లిస్తూ అర్థం కానట్లు చూశాడు.

''నేను నీకు అయిదు రూపాయలిస్తాను. అబద్ధమాడకుండా ఈరోజు ఎంత సంపాదించావో చెప్పు'' అన్నాను.

అయిదు రూపాయల మాట మాత్రమే అర్థమైనట్లుంది వాడికి. ''ఎందుకు సార్?'' అడిగాడు.

''నీ సొమ్ము నాకేమీ వద్దు. కాని ఈ రోజెంత సంపాదించావు'' మెల్లిమెల్లిగా నేను నడుస్తూ, వాడిని నడిపిస్తూ అడిగాను.

నిలబడినచోటే ఆగిపోయి వాడేసుకున్న షర్ట్‌కు రెండు వైపుల జేబుల్లోంచి డబ్బులు తీసి లెక్కపెట్టాడు.

''నూట ఇరవై రూపాయలు సార్. మీరిచ్చే అయిదు రూపాయలతో నూట ముప్పయి అవుతుంది'' అన్నాడు.

''లెక్కల్లో బాగా పెర్‌ఫెక్ట్‌గా వున్నావు'' అంటూ నేను అయిదు రూపాయల నాణేన్ని ఇచ్చాను. ''తృప్తిగా వుందా'' అంటూ కోపంతో అడిగాను.

భళ్ళున నవ్వాడు వాడు. ''ఏం తృప్తి సార్? దేనికి తృప్తి?'' అన్నాడు.

''ఈరోజు ఇంత డబ్బు సంపాదించావు కదా''

''ఊరుకోండి సార్. నా రోజువారి సంపాదన కనీసం రెండు వందలు వుంటుంది. రెండొందలుంటేనే గాని నాకు తృప్తిగా వుండదు. వంద రూపాయలు నాకు తాగడానికి పోతుంది. మిగతా సొమ్ముతో నా పెళ్ళాం, నేనూ బతకాలి, గుడిసె కిరాయి కట్టాలా...'' అంటూ ఏదేదో చెబుతున్నాడు. వాడితో సంభాషణ ఇంక అవసరమనిపించి వేగంగా ముందుకు నడిచాను.

చివరికి బిచ్చగాడు కూడా వాడి జీవితం పట్ల తృప్తిగా లేడు అనిపించింది.

సండే బజార్‌లో పుస్తకాలు చూస్తున్నాను. అద్భుతమైన పుస్తకాలు. గొప్పగొప్ప రచయితలవి ఎన్నో వున్నాయి. అన్నీ కొనాలనిపించేవే.

కాని ఎక్కడ పెట్టుకుంటాం ఇన్ని పుస్తకాలను. కిరాయి కొంప. ఇరుకు గదులు.

మనసుకు నచ్చే పని చేయాలన్నా పరిసరాలని బట్టి మనమే కాంప్రమైజ్ కావాలి మరి!

వెధవ జీవితం... తృప్తిలేని జీవితం..!

మనసులో కోపంగా వున్నప్పటికీ, మంచిమంచి పుస్తకాలు కనబడుతున్నాయి. శ్రీశ్రీ, మహాకవి గురజాడ, కందుకూరి, కార్ల్ మార్క్స్... అబ్బబ్బా... ఎన్నెన్ని పుస్తకాలు. అన్నీ కేవలం పది రూపాయల లోపే.

జేబులోంచి మూడు రూపాయలు తీసి మహాప్రస్థానం పుస్తకం కొన్నాను.

మహాప్రస్థానం పుస్తకంలోని కవితలన్నీ నాకు కంఠతా వచ్చినప్పటికీ, ఆ పుస్తకాన్ని చూస్తూ, అందులోని కవితలని ఆవేశంగా, ఆక్రోశంగా చదువుతుంటేనే మజా వస్తుంది. పసిపాప ఏడుపు వినిపించడంతో పక్కకు చూశాను.

పుస్తకాల షాపు పక్కనే పువ్వులు అమ్ముకునే మహిళ ఒడిలోని పసిపాప గట్టిగా ఏడుస్తోంది.

ఒకవైపు పూలు అల్లుతూనే, ఒళ్ళోని పసిపాపను సముదాయించడానికి ప్రయత్నిస్తున్నది ఆమె.

ఊరుకో నాన్నా. ఏడవకు అంటూ సముదాయిస్తూనే ఒక చేతితో పూలు అల్లుతూ, మరో చేతితో పూలు కొనాలని వచ్చేవారికి గజం.. మూర చొప్పున కొలిచి ఇస్తూ త్రిపాత్రాభినయం చేస్తుండడం గమ్మత్తనిపించింది.

మహిళలో ఎంతటి నేర్పరితనం ఇచ్చాడు భగవంతుడు. ఓపిక, ధైర్యం ఆమె సొంతం. పురుషుడిలోనూ ఈ గుణాలుండవు.

పొగరు, కోపం, చిరాకు ఉంటాయి.

పాపకు పాలిస్తున్నది ఆ మహిళ, భుజాల నిండుగా కొంగు వేసుకుని, ఒడినిండా తన పాపను హత్తుకుని, కేవలం బయటకు కనబడే చేతులతో పూలు అల్లుతూ. మరోవైపు కొనేవారితో సంభాషిస్తూ, నవ్వుతూ వుంటే ముచ్చటవేసింది.

పాప ఏడుపు ఆగింది. కొంగు తీసివేయడంతో తృప్తిగా బయట తలపెట్టి నవ్వుతూ ఆకాశంవైపు, తల్లివైపు మార్చిమార్చి చూడడం ఎంతో ఆనందాన్ని ఇచ్చింది.

''పాప బాగా ఏడ్చింది గదా...'' అన్నాను.

నావైపు ఒకసారి అర్థంగాని దానిలా చూసి.. ''అవునయ్యా, బాగా ఆకలేసినట్లుంది'' అంది.

పాపని మరోసారి చూశాను. కేరింతలతో తల్లి ఒడిలో ఆడుకుంటున్నది.

''మళ్ళీ ఆకలి అయినపుడే ఏడుస్తుంది కదా'' అన్నాను. ఆ పాపని మరోసారి చూడవచ్చనే ఆశతో.

''అవునయ్యా, పాపకి ఒకసారి పాలిస్తే మళ్ళీ ఆకలి అయ్యేంతవరకు ఏడవదు. తృప్తిగా ఆడుకుంటుంది. లేదా పడుకుంటుంది'' అంది.

'తృప్తి' అనే మాటతో ఒక్కసారి షాక్ అయింది.

నిజమే – ఆ పాప ముఖంలో ఎంతో తృప్తి కనిపిస్తోంది. తల్లి ఒడి, తల్లిపాలు, ఆ పాపలో ఎంతో నమ్మకాన్ని పెంచింది. కడుపు నిండా పాలు తాగి, ఎంతో తృప్తిగా ఆడుతూ కేరింతలు కొట్టడం నాలోని ప్రశ్నకి జవాబు దొరికింది.

★